సాక్షి
నారాయణపేట

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025

గరిష్ఠం/కనిష్ఠం
40.6 /23.5
వాతావరణం
మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కాస్త పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

‘ఓపెన్’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు
- ఎస్సెస్సీలో 573 మంది.. ఇంటర్‌లో 940 మంది విద్యార్థులు



లిటిల్‌స్టార్స్ సెంటర్‌లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న నిర్వాహకులు

నారాయణపేట రూరల్: సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా చదువుకుంటున్న విద్యార్థులకు ఆదివారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా టాస్‌కు 29 స్టడీ సెంటర్లు ఉండగా వాటిలో ఓపెన్ టెన్త్ కొరకు 573 మంది, ఓపెన్ ఇంటర్‌కు 941మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి కోసం మూడు ఎస్‌ఎస్‌సీ, నాలుగు ఇంటర్‌కు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీపీఎం, గర్ల్స్ స్కూల్, గ్రౌండ్ పాఠశాలల్లో పదో తరగతి కొరకు, కృష్ణవేణి, శ్రీనారాయణ, లిటిల్ స్టార్స్, శ్రీసాయి స్కూల్ ఇంటర్ విద్యార్థులకు కేటాయించారు. పరీక్షలకుగాను ఏడుగురు సీఎస్‌లు, మరో ఏడు మంది డీఓలతో పాటు ప్రతీ సెంటర్‌కు ఒకరు చొప్పున మొత్తం ఏడుగురు సిట్టింగ్ స్క్వాడ్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించగా, ప్రతీ 20మంది అభ్యర్థులకు ఒకరు చొప్పున మొత్తం 85మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొననున్నారు. అదే విధంగా తనిఖీలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి, టాస్ కో ఆర్డినేటర్‌తో మరో బృందం పర్యటిస్తారు. ఏప్రిల్ 20 నుంచి 25 వరకు టాస్ పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు టాస్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టణంలోని అన్ని కేంద్రాల్లో పరీక్షల ఏర్పాట్లను డీఈఓ గోవిందరాజు, సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి, టాస్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పరిశీలించారు. విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పేపర్ లీకేజీ ఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా సెంటర్‌కు ముగ్గురు చొప్పున 21మంది ఏఎస్‌ఎంలు, ఇద్దరు చొప్పున 14మంది పోలీస్ సిబ్బందిని కేటాయించారు.

ఓపెన్ ఎస్సెస్సీ సెంటర్, విద్యార్థుల సంఖ్య	
ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్	247
ప్రభుత్వ బాలికల పాఠశాల	196
డీపీఎం స్కూల్	130

ఓపెన్ ఇంటర్ సెంటర్, విద్యార్థుల సంఖ్య	
లిటిల్‌స్టార్స్ స్కూల్	245
శ్రీనారాయణ స్కూల్	245
శ్రీసాయి స్కూల్	245
కృష్ణవేణి స్కూల్	206

న్యూస్‌రీల్

ప్రతి కేసుపై పారదర్శక విచారణ



నారాయణపేట: ప్రతి కేసుపై పారదర్శక విచారణ చేయాలని, కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని, గంజాయి, గుట్కా, పేకాట పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలని డీఎస్పీ ఎన్. లింగయ్య ఆదేశించారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ ఉన్న గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి సీఐ, ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. ఆత్మహత్యల కేసులలో అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐలు శివ శంకర్, సైదులు, రాజేందర్ రెడ్డి, రామ్ లాల్ పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు



నారాయణపేట: యాసంగి వరి కొనుగోళ్లలో పొరుగు రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వరి ధాన్యం రాకుండా నివారించేందుకు జిల్లా పరిధిలో 6 బోర్డర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. నారాయణపేట మండలంలో జలాల్పూర్ చెక్ పోస్ట్, దామరగిద్ద మండలం కానుకుర్తి వద్ద, కృష్ణ మండలంలో చేగుంట వద్ద, కృష్ణా బ్రిడ్జి వద్ద, ఊట్కూర్ మండలంలో సమస్తాపూర్ వద్ద, మాగనూర్ మండలంలోఉజ్జెల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ బోర్డర్ చెక్‌పోస్టులో పోలీస్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వరి ధాన్యం రాకుండా చూడాలని, వాహనాల వే బిల్లులను తనిఖీ చేయాలని సూచించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టు దగ్గర వచ్చి పోయే ప్రతి ఒక్క వాహనాల నంబర్లను రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. వ్యాపారస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, చెక్‌పోస్టుల వద్దనే కాకుండా బోర్డర్ గ్రామాల నుంచి జిల్లాలోకి వరి ధాన్యం రాకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న హెచ్‌ఓలు నిరంతరం చెక్‌పోస్టులపై నిఘా ఉంచాలని తెలిపారు.

పీయూలో కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి నిరవధిక సమ్మె బాట పట్టారు. ఈ మేరకు పీయూ ప్రధాన గేట్ వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు భూమయ్య, శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నెట్, సెట్, పీహెచ్‌డీ వంటి అర్హతలు ఉన్న అధ్యాపకులను ఎలాంటి షరతులు లేకుండా నేరుగా రెగ్యులరైజ్ చేయాలని, జీఓ నంబర్ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మెకు నాన్ టీచింగ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్, బుర్రన్న సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో రవికుమార్, సుదర్శన్‌రెడ్డి, విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఈశ్వర్ పాల్గొన్నారు.

అవినీతికి అడ్డా!

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అవినీతి తిమింగలాలు



డీఎంహెచ్‌ఓ కార్యాలయం



- నోటిఫికేషన్లు లేకుండానే పోస్టింగ్‌లు
- కలెక్టర్ అనుమతులు సైతం లేని వైనం
- ఉద్యోగాలు పొందిన వారికి ఐడీలు ఇవ్వకపోవడంతో అయోమయం
- విచారణ చేపట్టిన జిల్లా అధికార యంత్రాంగం

నారాయణపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయకుండా.. కలెక్టర్ అనుమతులు లేకుండా పలు పోస్టింగులు ఇవ్వడంతో అటు ప్రభుత్వ యంత్రాంగాన్ని, ఇటు ఉద్యోగం పొందిన వారిని అయోమయంలో పడేసినట్లయింది. దీనిపై సమగ్ర విచార చేపట్టాలంటూ ఎంపీతో పాటు కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేయగా.. తాజాగా విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

బయట పడిందిలా..

వివిధ స్థాయిలో ఉద్యోగాల్లో నియామకాలు జరిపిన వారికి జీతాలు చెల్లించాలంటే వారికి ఐడీ నంబర్లు ఉండాలి. అయితే వారికి ఐడీ నంబర్లు కేటాయించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి హైదరాబాద్‌లోని కమిషనరేట్‌కు వెళ్లారు. మా కమిషనరేట్ నుంచి ఉద్యోగాలను భర్తీ చేసుకోవాలని ఆర్డర్ ఏమైనా ఇచ్చామా, లేక కలెక్టర్ అప్రూవల్‌తో ఉద్యోగులను నియమించుకున్నారా అని వారు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అనుమతులు లేకుండా అక్రమంగా నియామకం చేపట్టిన వారికి ఐడీ నంబర్లు ఇచ్చే ప్రసక్తే లేదని ఆ అధికారిని తిప్పి పంపించడంతో ఈ తతంగం బయటపడినట్లు సమాచారం.

విచారణ చేపట్టిన జిల్లా అధికార యంత్రాంగం

డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఇటీవల కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని ఓ ఉద్యోగిని, జిల్లా అడిషనల్ కలెక్టర్లతో విచారణ జరిపించినట్లు సమాచారం. ఫిర్యాదులో పేర్కొన్న ఆంశాలతో పాటు మరిన్ని విషయాలు అధికారుల విచారణలో తెలినట్లు తెలుస్తోంది. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల పుట్టను తయారు చేసి కలెక్టర్ ద్వారా రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులకు నివేదించినట్లు సమాచారం.

అవినీతి ఆరోపణలు ఇవీ..

- జిల్లా మలేరియా అధికారిగా పనిచేస్తున్న ఓ అధికారి సతీమణిని ఆర్‌బీఎస్‌కే కింద ఫార్మసిస్టుగా నియమించారు. ఈమె ఆర్‌బీఎస్‌కే ‘ఎ’ టీంలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.
- తిప్రాస్‌పల్లికి చెందిన ఓ యువకుడు ఫార్మాసిస్టుగా ఆర్‌బీఎస్‌కే కోస్గి టీంలో పనిచేస్తున్నారు. (ఉద్యోగులకు ఐడీ నంబర్లు ఇవ్వమని తెలపడంతో ఈయనకు ఇచ్చిన ఆర్డర్ కాపీని వెనక్కి తీసుకున్నట్లు సమాచారం.)
- జిల్లాలోని ఓ ఎమ్మెల్యే ఊట్కూరుకు చెందిన బీహెచ్‌ఎంఎస్ చేసిన ఓ వైద్యుడికి ఎంఎల్‌హెచ్‌పీగా తీసుకోవాల్సిందిగా రెఫర్ చేస్తూ లెటర్ ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ అదే లెటర్‌లో.. 104లో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న డీఈఓ పేరును సైతం జోడించి జిల్లా కమ్యూనిటీ మోబిలైజర్(డీసీఎం)గా నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
- ఓ మహిళను ఎన్‌హెచ్‌ఎం కింద 2024 డిసెంబర్‌లో స్టాఫ్‌నర్స్‌గా నియమించడంతో మరికల్ పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు.
- మరో వ్యక్తిని అక్టోబర్ 2024లో కృష్ణా పీహెచ్‌సీకి ఆయుష్ ఫార్మాసిస్టుగా నియమించారు. కానీ అతను ఫార్మసిస్టే కాదు.
- ఓ యువకుడు కోటకొండ పీహెచ్‌సీ, మరో యువతి కోస్గిలో డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరందరినీ ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఆయా నియామకాలను చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఊట్కూరు పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న మహిళ వైద్య పరీక్షల నిమిత్తం రెండు నెలలు సెలవులో ఉన్నా వేతనం మాత్రం డ్రా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈమె భర్త కలెక్టరేట్‌లో కంప్యూటర్ ఆపరేటర్ అనే సాకుతోనే రెండు నెలల జీతాన్ని చెల్లించినట్లు సమాచారం.

చర్యలు తీసుకోవాలి



జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నోటిఫికేషన్లు వేయకుండా, కలెక్టర్ అనుమతులు లేకుండా తన ఇష్టానుసారంగా ఉద్యోగాలు ఇచ్చిన డీఎంహెచ్‌ఓపై చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఎంపీ డీకే అరుణకు డీఎంహెచ్‌ఓ పై ఫిర్యాదు చేశాం. త్వరలోనే హెల్త్ డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి విన్నవించబోతున్నాం.

– బొడిగల శ్రీనివాస్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, నారాయణపేట

అవి ఆరోపణలు మాత్రమే

మా కార్యాలయంపై వస్తున్న ఫిర్యాదులన్నీ కేవలం ఆరోపణలు మాత్రమే. ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన విషయం వాస్తవం. తాను సెలవులో ఉండడంతో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలుస్తోంది. ఆ రిపోర్టులో ఏం రాశారో తమకు తెలియదు.

– సౌభాగ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

భూ భారతి చట్టంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్, చిత్రంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని... ఈ చట్టం ఎంతో సులభమైన, సరళమైందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని సింగారం చౌరస్తా వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి శిక్షణా కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హాజరయ్యారు. సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్త పోర్టల్‌లో సింగిల్ ఆఫీసర్‌కు అధికారాలు ఇచ్చారని, భూ సమస్యలను బట్టి తహసీల్దార్, ఆర్డీఓ, రెవెన్యూ కలెక్టర్ స్థాయిలో అధికారాలు ఉన్నాయని, వారి పరిధి కంటే ఎక్కువ సమస్య ఉంటే కలెక్టర్‌కు అధికారం ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే, ఆధార్ కార్డు ఎలాగో ప్రతి రైతుకు తన భూమికి సంబంధించిన అన్ని వివరాలతో కూడిన భూదార్ కార్డును జారీ చేయనున్నట్లు వివరించారు. ఈ కొత్త చట్టం, రూల్స్ జూన్ 2 తర్వాత అన్ని గ్రామాలలో సదస్సులు నిర్వహించి అక్కడి రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ.. ఈ కొత్త చట్టంపై రైతులందరికీ అవగాహన ఉంటే ఎవరికి వారే అధికారుల వద్దకు వెళ్లి భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవచ్చని అన్నారు. గత ప్రభుత్వంలోని ధరణిలో సాదా బైనామాలకు అవకాశం లేకపోయిందని, నియోజకవర్గంలో వెయ్యి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అంతేగాక, చిన్న చిన్న సమస్యలు పరిష్కారంకాక గతంలో రైతులు కోర్టుకు వెళ్లాలల్సిన పరిస్థితి ఉండేది కానీ ఇప్పుడు కోర్టుకు వెళ్లకుండా ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా రైతుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. రైతులందరూ భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకుని గొడవలు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. సదస్సులో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, రాజేష్, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలి

కొత్తపల్లి/కోస్గి రూరల్: గడువులోగా మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని, ఇసుక సమస్య అతిత్వరలో పరిష్కరిస్తామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కొత్తపల్లి, గుండుమాల్ మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను శనివారం సాయంత్రం కలెక్టర్ పరిశీలించారు. కొత్తపల్లి సమీపంలో మూడు ఎకరాల స్థలంలో రూ.8.80 కోట్లతో చేపడుతున్న మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే, గుండుమాల్ పీహెచ్‌సి పక్కన గల రెండు ఎకరాల స్థలంలో నిర్మించే నిర్మాణ స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. రెండు చోట్ల ఇసుక సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. సమస్యను పరిష్కరించి రెండు రోజుల్లో ఇసుక వచ్చేలా చూడాలని ఆయా తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ హీర్యానాయక్, డీఈ విలోక్, తహసిల్దార్లు జయరాములు, భాస్కర్ స్వామి, ఏఈ అంజి రెడ్డి పాల్గొన్నారు.

బాదేపల్లి యార్డుకు పోటెత్తిన మొక్కజొన్న

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్ యార్డుకు శనివారం మొక్కజొన్న దిగుబడులు పోటెత్తాయి. 4,579 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి రాగా.. క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,260, కనిష్టంగా రూ.1,521 ధరలు లభించాయి. వేరుశనగ గరిష్టంగా రూ.6,100, కనిష్టంగా రూ.4,816, పెబ్బర్లు గరిష్టంగా రూ.4,957, కనిష్టంగా రూ.4,617, రాగులు గరిష్టంగా రూ.2,611, కనిష్టంగా రూ.2,511, జొన్నలు రూ.3,907, ధాన్యం హంస గరిష్టంగా రూ.1,969, కనిష్టంగా రూ.1,806, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,209, కనిష్టంగా రూ.1,806, ఆముదాలు గరిష్టంగా రూ.6,278, కనిష్టంగా రూ.5,629, పత్తి రూ.5,389, శనగలు రూ.5,250 ధరలు లభించాయి.

పేదవాడి చుట్టంలా 'భూ భారతి'

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి

నాగర్‌కర్నూల్: పేదల భూ సమస్యలు తీర్చే చట్టమే భూ భారతి అని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రం సమీపంలోని గగ్గలపల్లిలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో భూ భారతి చట్టం–2025పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల కన్నీరు తుడవడానికి తీసుకొచ్చిన చట్టమే భూ భారతి అని, ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఒక చట్టం రూపొందిస్తే అది పేదవాడికి చుట్టంలాగా ఉండాలని.. భూ భారతి చట్టం వందేళ్లకు సరిపడే విధంగా ఉందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి చెప్పులు అరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగారని.. ఇప్పుడింకా ఆ అవసరం లేదని, అధికారులే రైతుల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. మే 1 నుంచి ప్రతి రెవెన్యూ గ్రామానికి అధికారులు వచ్చి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని వివరించారు.ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ప్రతిపక్షాలు అవాస్తవాల్ని వాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని.. ప్రజలు గుర్తించి పేదల అభ్యున్నతికి పాటుపడే ఇందిరమ్మ ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా : రైతు దుర్మరణం

ఇటిక్యాల: ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో ఓ రైతు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని షాబాద్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ వివరాల మేరకు.. షాబాద్‌కు చెందిన రైతు తెలుగు చిన్న రామకోటి (65) ట్రాక్టర్‌తో గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలాన్ని దున్ని వస్తుండగా.. శనగపల్లి రోడ్డు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో చిన్న రామకోటికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి


గుడిసె శ్రీనివాసులు (ఫైల్)

అమరచింత: బావిలోని బోరు మోటారు బయటకు తీసే ప్రయత్నంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందిన ఘటన అమరచింతలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అమరచింతకు చెందిన హమాలీ గుడిసె శ్రీనివాసులు (34)తో పాటు హమాలీ రిక్షా రవి, మరో రవి ముగ్గురు కలిసి రిటైర్డ్ టీచర్ గోపాల్‌రెడ్డి పొలంలోని బావిలో ఉన్న బోరుమోటారు బయటకు తీసేందుకు వెళ్లారు. మోటారును బయటకు తీసుకుని వస్తున్న క్రమంలో బోరుపైపులు గుడిసె శ్రీనివాసులుపై పడటంతో అతడు బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్తుల సహాయంతో బావిలో నుంచి అతడి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి భార్య సువర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతదేహం లభ్యం

కేటీదొడ్డి: ఉపాధి హామీ పథకం పనులు చేస్తుండగా.. గుర్తుతెలియని యువకుడి (30) మృతదేహం లభ్యమైన ఘటన కేటీదొడ్డి మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కేటీదొడ్డి గ్రామ శివారులో ఉన్న కొత్తకుంట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని ప్రభుత్వ భూమిలో వర్షపునీటి నిల్వ కోసం ఉపాధి హామీ పథకం కూలీలు గుంతలు తవ్వుతుండగా.. యువకుడి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, ఎస్ఐ శ్రీనివాసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి గొంతు కోసినట్లు ఆనవాళ్లను గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ నాయకుడి హత్యకు కుట్ర?

దేవరకద్ర/దేవరకద్ర రూరల్: దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన ఒక బీజేపీ ముఖ్యనేతపై ప్రత్యర్థులు హత్యకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆయనకు తెలియడంతో తన వద్ద ఉన్న ఆధారాలతో ఎస్పీ జానకికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ చేసి, తనకు రక్షణ కల్పించాలని కోరినట్లు తెలిసింది.

ఇద్దరి ప్రాణాలు తీసిన అతివేగం


ప్రమాదానికి గురైన కారు


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

- ఎన్‌హెచ్–44పై బోల్తాపడిన కారును ఢీకొట్టిన ట్రావెల్ బస్సు
- భార్యాభర్తల దుర్మరణం.. మరో నలుగురికి గాయాలు
- బంధువుల గృహ ప్రవేశానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- మృతులు నంద్యాల జిల్లా వాసులు

ఎర్రవల్లి: అతివేగం ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. బంధువుల గృహప్రవేశానికి వెళ్లి వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తాపడటం.. అదే సమయంలో వస్తున్న ట్రావెల్ బస్సు కారును ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఎర్రవల్లి మండలం వేముల స్టేజీ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ మురళి వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కాకునూరుకుచెందిన దేరెడ్డి పుల్లారెడ్డి (59), ఆయన భార్య లక్ష్మి పుల్లమ్మ (51), కుమారుడు వెంకటసుబ్బారెడ్డితో పాటు మరో ముగ్గురు కుటుంబ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో బంధువుల గృహప్రవేశానికి వెళ్లారు. అక్కడ కార్యక్రమం పూర్తయ్యాక తిరిగి అదే రోజు రాత్రి 8:30 గంటలకు కారులో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని ఎర్రవల్లి మండలం వేముల స్టేజీ సమీపంలో దేరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డుపై బోల్తా పడింది. అదే సమయంలో కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సు కారును ఢీకొట్టడంతో భార్యాభర్తలు దేరెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మి పుల్లమ్మతో పాటు వారి బంధువు స్రవంతికి తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు తేలికపాటి రక్త గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే దేరెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మిపుల్లమ్మ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుల బంధువు మహేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని..
కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్య

- సాంకేతిక పరిజ్ఞానంతో హత్యకేసును ఛేదించిన పోలీసులు
- ఐదుగురు నిందితులకు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను కడతేర్చిందో భార్య. వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడించారు. సూగూరు గ్రామానికి చెందిన రవి, అతడి భార్య సునీత మేస్త్రీ నరేశ్ వద్ద పనిచేస్తుండే వారు. క్రమంలో శ్రీరంగాపూర్‌కు చెందిన అరవింద్‌తో సునీతకు పరిచయమై వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం భర్త రవికి తెలియడంతో అరవింద్‌ను హెచ్చరించాడు. అప్పటి నుంచి రవి తన భార్య సునీతను ఇబ్బంది పెడుతుండేవాడు. ఈ క్రమంలో తన భర్త అడ్డు తొలగించాలని ప్రియుడు అరవింద్‌కు చెప్పడంతో గత నెల 18న అతడు తన స్నేహితులైన భగవంతు, గిరితో కలిసి అయ్యవారిపల్లిలో మద్యం తాగుతూ రవి హత్యకు పథకం రచించారు. ఈ మేరకు మార్చి 19న సాయంత్రం అరవింద్ తన స్నేహితుడైన సూగూరుకు చెందిన బాష కారును అవసరం ఉందని తీసుకుని అయ్యవారిపల్లిలో భగవంతు, గిరిని ఎక్కించుకున్నాడు. వెంకటాపురంలో ఒక కిరాణం షాపులో మద్యం, వాటర్ బాటిల్స్, నల్ల కవర్స్ తీసుకున్నారు. అక్కడి నుంచి సూగూరుకు వెళ్లి ఆంజనేయులు అనే వ్యక్తితో రవికి ఫోన్ చేయించి మద్యం తాగుదామని పిలిపించారు. వారి వద్దకు వచ్చిన రవిని కారులో ఎక్కించుకుని గ్రామ సమీపంలోని శ్మశానవాటిక వద్దకు వెళ్లి మద్యం తాగారు. రవి మత్తులోకి వెళ్లిన తర్వాత అందరూ కలిసి అతడి ముఖానికి ప్లాస్టిక్ కవర్లు చుట్టి ఊపిరాడకుండా చేసి చంపారు. ఎవరికీ అనుమానం రాకూడదని కొత్త సూగూరు ఊరి బయట రోడ్డు పక్కన శవాన్ని ఉంచి, నేరానికి ఉపయోగించిన ప్లాస్టిక్ కవర్లను బూడిదపాడు వద్ద వాగులో పడేసి వెళ్లిపోయారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు. సునీతను తమదైన శైలిలో విచారించగా.. చేసిన నేరాన్ని ఒప్పుకుంది. హత్యలో పాల్గొన్న వారిని అరెస్టు చేసి.. వారి నుంచి కారు, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్ విధించినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, పెబ్బేరు ఎస్ఐ యుగంధర్ రెడ్డి ఉన్నారు.

లభించని ఆరుగురి ఆచూకీ


ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

ఎస్ఎల్‌బీసీలో 57 రోజులకు చేరిన సహాయక చర్యలు

అచ్చంపేట: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి శనివారంతో 57 రోజులకు చేరింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఆర్మీ, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్ వంటి 12 విభాగాలకు చెందిన సిబ్బంది విడతల వారీగా 24గంటల పాటు సహాయక చర్యలు చేపడుతున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఐదు ఎస్కవేటర్ల సాయంతో మట్టి తొలగిస్తున్నప్పటికీ ఆరుగురి కార్మికుల ఆచూకీ మాత్రం లభ్యం కావడం లేదు. డీ–2 నుంచి డీ–1 ప్రదేశంలో మట్టి, బురద, రాళ్లు తొలగించినా కార్మికుల జాడ లభించక పోవడంతో.. కంచె ఏర్పాటు చేసిన నిషేధిత ప్రదేశం 40 మీటర్ల పరిధిలో ఉండే అవకాశం ఉందని సహాయక సిబ్బంది భావిస్తున్నారు. ప్రభుత్వం విధించిన గడువు ఈ నెల 20వ తేదీలోగా శిథిలాల తొలగింపు పూర్తి చేయాల్సి ఉండటంతో సహాయక సిబ్బంది రాత్రిబంవళ్లు శ్రమిస్తున్నారు. యంత్రాలతో ఎక్కువగా పనులు చేస్తుండటంతో సిబ్బందిని తగ్గిస్తూ వస్తున్నారు.

ప్రమాద ప్రదేశం పరిశీలన..

ఎస్ఎల్‌బీసీ సొరంగం పైకప్పు కూలిన ప్రదేశంలో మట్టి తొలగింపు సాధ్యాసాధ్యాలను సహాయక బృందాల ఉన్నతాధికారులు మరోసారి పరిశీలించారు. అయితే ఇప్పట్లో డేంజర్ జోన్ ప్రదేశంలో తవ్వకాలు జరిపే వీలు కనిపించడం లేదు. మరో రెండు రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన బృందాలు సహాయక చర్యలను నిలిపివేసి వారి స్వస్థలాలకు వెళ్లే అవకాశం ఉంది. కాగా, సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు ఎస్కవేటర్ల సాయంతో మట్టి, బురదతీత పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. డేంజర్ జోన్ సమీపంలో మట్టి తరలింపునకు అడ్డుగా వస్తున్న బండ రాళ్లను విచ్ఛిన్నం చేసి లోకో ట్రేన్ ద్వారా బయటకు తరలిస్తున్నట్లు వివరించారు. సిబ్బందికి అవసరమైన సామగ్రిని సమకూరుస్తున్నామని.. తాగునీరు, ఆహార పదార్థాలను లోకో ట్రేన్ ద్వారా సొరంగం లోపలకు పంపిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, దక్షిణమధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

ప్రసవం కోసం వెళ్తే ప్రాణం పోయింది..


రేణుక (ఫైల్)

జడ్చర్ల: పురిటి నొప్పులతో ప్రసవం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన నిండు గర్భిణి మృత్యువాత పడిన ఘటన జడ్చర్ల పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. రాజాపూర్ మండలం మల్లేపల్లికి చెందిన రేణుక (24)ను నవాబుపేట మండలం పల్లెగడ్డకు చెందిన నరేందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరు హైదరాబాద్‌లోని శివరాంపల్లిలో నివాసం ఉంటున్నారు. అయితే రేణుక మొదటి కాన్పు కోసం తల్లిదండ్రులు శుక్రవారం జడ్చర్ల ఇందిరానగర్ కాలనీలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రి వైద్యురాలు ఆమెను పరీక్షించి జాయిన్ చేసుకున్నారు. రాత్రివేళ ఆకస్మికంగా ఆమెకు ఫిట్స్ వచ్చి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సదరు ఆస్పత్రి వైద్యురాలు మెరుగైన వైద్యం కోసం తన వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు ఆమెను పరీక్షించి.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, తన కూతురు మరణంపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి వడ్డె పరశురాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉంటే, ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన భార్య రేణుక మృతిచెందిందని భర్త నరేందర్‌తో పాటు బంధువులు మొదట ఆరోపించారు. తన భార్యకు ఎప్పుడూ ఫిట్స్ రాలేదని.. కానీ ఫిట్స్ వచ్చినట్లు తనకు ఫోన్‌లో తెలిపారన్నారు. విషయం తెలుసుకుని తాను ఆస్పత్రికి వచ్చే సరికే పేషంట్ కండీషన్ సీరియస్‌గా ఉందంటూ జిల్లా ఆస్పత్రికి తరలించారని తెలిపారు. కాగా, గర్భిణి మృతికి సంబంధించి సంబంధిత ఆస్పత్రి నిర్వాహకులు, మృతురాలి కుటుంబీకుల మధ్య చర్చలు సాగినట్లు సమాచారం.

గర్భిణి మృతిపై విచారణ..

గర్భిణి మృతిపై మాస్ మీడియా అధికారిణి మంజుల శనివారం విచారణ జరిపారు. సదరు ఆస్పత్రి డాక్టర్ నీలోఫర్ జగీర్దార్‌తో వివరాలు సేకరించారు. అయితే వైద్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించలేదని.. పరిస్థితి విషమంగా ఉండటంతో తన కారులో జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు వైద్యురాలు తెలిపారు. అయితే పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు చేపడుతామని మాస్ మీడియా అధికారిణి పేర్కొన్నారు.

కొడుకుపై కోపంతో తండ్రిని హతమార్చారు..


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రామేశ్వర్

అచ్చంపేట రూరల్: పట్టపగలే ఓ వ్యక్తిపై గొడ్డలి, సుత్తితో దాడిచేసి హతమార్చిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ నెల 15న అచ్చంపేట మండలం నడింపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై చోటు చేసుకున్న హత్య కేసు వివరాలను శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులుతో కలిసి ఏఎస్పీ రామేశ్వర్ వెల్లడించారు. వివరాలిలా.. నడింపల్లి గ్రామానికి చెందిన బూరం వీరయ్య చిన్న కుమారుడు పరమేశ్ అదే గ్రామానికి చెందిన సుగూరు మహేశ్ భార్యతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. గత నెల 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా గురుజాలకు ఆమెను తీసుకెళ్లాడు. తన భార్య అదృశ్యంపై అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో భర్త మహేశ్ ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న మహేశ్ బంధువులు గురుజాలకు వెళ్లి పరమేశ్‌పై దాడిచేసి సదరు మహిళను ఇంటికి తీసుకువచ్చారు. ఆ తర్వాత పరమేశ్ వైఖరిలో మార్పు రాకపోవడం.. వాట్సాప్ స్టేటస్‌లో ఈ నెల 15న మహిళతో ఉన్న ఫొటోలను పెట్టాడు. ఈ క్రమంలో భర్త మహేశ్ అదే గ్రామానికి చెందిన పదిర శివ, ఎడ్ల మహేశ్‌లతో కలిసి పరమేశ్ కుటుంబ సభ్యులను హత్య చేసేందుకు పథకం రచించారు. ఈ నెల 15న అచ్చంపేట నుంచి నడింపల్లికి బైక్‌పై వెళ్తున్న పరమేశ్ తండ్రి బూరం వీరయ్య, సోదరుడు వెంకటేశ్‌ను కారు, బైక్‌తో వెంబడించారు. నడింపల్లి సమీపానికి రాగానే ఒక్కసారిగా వీరయ్యపై గొడ్డలి, సుత్తితో దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్‌పై దాడికి యత్నించగా.. సమీప గ్రామస్తులు రావడంతో వదిలిపెట్టి వెళ్లారు. హత్యలో పాల్గొన్న ముగ్గురు నిందితులు గతంలో నేర చరిత్ర కలిగి ఉండటంతో వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హత్య కేసును ఛేదించిన డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఉప్పునుంతల ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఇందిర, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుళ్లు విశ్వనాథ్, బాలస్వామి, మల్లేష్, విష్ణు ఉన్నారు.

అడవి నరికివేత



కొల్లాపూర్: మండలంలోని ఎల్లూరు శివారులో అడవిని కొందరు నరికివేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లూరు శివారులోని 359, 360, 364, 365, సర్వే నంబర్లలో సురభి రాజవంశ వారసులకు దాదాపు 50 ఎకరాల మేరకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. వారు ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారికి ఈ భూములను అమ్మినట్లు సమాచారం. సదరు వ్యాపారి అక్కడి చెట్లన్నీ నరికివేసి అక్కడే తగులబెడుతున్నారు. అయితే ఈ భూములు స్వాతంత్ర్యం రాక మునుపు నుంచి అడవిగానే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై అటవీ రేంజర్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఆయా సర్వేనంబర్లలో కొంతమేరకు పట్టా భూములు ఉన్నాయని తెలిపారు. అటవీ భూమిలోని చెట్లను కూడా వారు తొలగించడంతో జరిమానా విధించినట్లు వెల్లడించారు. అయితే రెవెన్యూ, అటవీ భూములు ఎంతమేరకు ఉన్నాయనే అంశాలపై సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. అటవీ భూముల్లో చెట్లు తొలగించినట్లు తేలితే యంత్రాలతో పాటు చెట్లు తొలగించిన వారందరిపై చట్టపరంగా ముందుకు వెళతామన్నారు.

'జేఈఈ'లో అత్యుత్తమ 'ప్రతిభ'


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. ఆలిండియా స్థాయిలో విద్యార్థులు విశాల్ 281వ ర్యాంకు, సాకేత్‌కుమార్ రెడ్డి 98.75 పర్సంటైల్‌తో 2,587వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు భీంసింగ్ రాథోడ్ 2,683, తిరుపతి 4,952వ ర్యాంకు, కేదార్‌నాథ్ 98.28 పర్సంటైల్‌తో 6,988వ ర్యాంకు, వర్షిత్‌గౌడ్ 98.15 పర్సంటైల్‌తో 7,661వ ర్యాంకు, ప్రేమ్‌చంద్ 7,682వ ర్యాంకు సాధించగా.. కె.భరత్ 96.16, సి.జతిన్ 96.03, నాగకౌశిక 96.95, భానుప్రదీప్ 95.43, సాయి జశ్వంత్‌రెడ్డి 95.39, సాయి రేవంత్‌రెడ్డి, 95.04 పర్సంటైల్ సాధించారు. 90 పర్సంటైల్‌కు పైగా 48మంది, 80 నుంచి 90 పర్సంటైల్ మధ్య 62 మంది సాధించారని.. ఫలితాల్లో 198 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమంలో డైరెక్టర్స్ మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'రిషి' విద్యార్థుల ప్రభంజనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో రిషి కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. కళాశాల విద్యార్థులు 1000 లోపు ర్యాంకులతో అత్యుత్తమ ప్రతిభ చాటారు. రోహిత్‌రెడ్డి 308, జంగం శ్రీతులసి 927వ ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ చంద్రకళ వెంకట్ తెలిపారు. వీరితో పాటు సాయి సుజన్‌రెడ్డి 98.40, ప్రణీత్‌కుమార్ 98.04, సాయి అక్షయ 97.08, తరుణ్‌సాయి 96.76 పర్సంటైల్ సాధించారన్నారు. 90శాతం పర్సంటైల్‌ను 36 మంది సాధించగా.. జేఈఈ అడ్వాన్స్‌కు 45 మంది అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక ర్యాంకులు సాధించిన కళాశాలగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమీ చీఫ్ అడ్వైజర్ వెంకటయ్య, డీన్ లక్ష్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్తా చాటిన వాగ్దేవి విద్యార్థులు


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి ఐఐటీ అకాడమీ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా చాటారు. విద్యార్థులు రోహిత్ 99.80 పర్సంటైల్, మనోహర్ 99.40, రేవంత్‌రెడ్డి 98 పర్సంటైల్ సాధించారు. వీరితో పాటు ఓంకార్, ఆర్తి, కౌశిక్, అశ్విని, మమత, నవనీత్‌గౌడ్, నవీన్, శివ, శరణ్య, గణేశ్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమంలో భాగంగా అకాడమీలో మెరుగైన విద్య అందించడంతో పాటు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, యాజమాన్య సభ్యులు రాఘవేందర్‌రావు, శివకుమార్, నాగేందర్, సతీశ్‌రెడ్డి, షాకీర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

బాగా ప్రాక్టీస్ చేశా..



మొదటి సంవత్సరం నుంచి జేఈఈ పరీక్ష కోసం సిద్ధమయ్యాను. గతంలో వచ్చిన ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేశాను. మాక్ టెస్టులు కూడా చాలా రాశాను. ఈ క్రమంలో పరీక్ష రాయడం చాలా సులువుగా మారింది. మా నాన్న రైతు. ఆయన ఎంతో శ్రమకోర్చి నన్ను చదివించారు. నేను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనే లక్ష్యంతో చదువుతున్నా.

– ప్రణీత్‌కుమార్‌రెడ్డి, విద్యార్థి, రిషి కళాశాల (98.04 పర్సంటైల్)

సాఫ్ట్‌వేర్ కావాలని..



నాకు ఊహ తెలిసిన నాటి నుంచి సాఫ్ట్‌వేర్ కావాలనే లక్ష్యంతో చదువుతున్నా. అందుకోసం జేఈఈలో మంచి మార్కులు సాధించాను. తరగతి గదిలో ఏ సందేహం వచ్చిన సార్ వాళ్లు వెంటనే నివృత్తి చేసేవారు. మంచి మెటీరియల్ ఫాలో కావడం, సమయపాలన పాటించడం వల్ల అనుకున్న లక్ష్యం నెరవేరింది. భవిష్యత్‌లో మరింత రాణించేందుకు కృషిచేస్తా.

– వర్షిణి, విద్యార్థిని, రిషి కళాశాల (96.56 పర్సంటైల్)

అధ్యాపకుల సహకారంతో..



జేఈఈ పరీక్షకు సిద్ధమయ్యే క్రమంలో అధ్యాపకుల సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయి. నోట్స్ ప్రిపేర్ కావడం, గతంలో వచ్చిన ప్రశ్నలు, సిలబస్‌లో ముఖ్యమైన వాటిని ఎక్కువ సార్లు చదవడం వంటి వాటి వల్ల అనుకున్న విధంగా మంచి పర్సంటైల్ సాధించాను. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివాను.

– సాకేత్‌కుమార్‌రెడ్డి, విద్యార్థి, ప్రతిభ కళాశాల (98.75 పర్సంటైల్)

ఎక్కువ సమయం కేటాయించా..



ముఖ్యమైన అంశాలను ఎక్కువ సార్లు రాయడం, నోట్ చేసుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం కలిగింది. ఇందుకు ఎక్కువ సమయం కేటాయించాను. అధ్యాపకుల సలహాలు, సూచనలతో మంచి మెటీరియల్ చదివాను. అనుకున్న ఫలితం వచ్చాయి. మా నాన్న ప్రైవేటు ఉద్యోగి. ఆయన అనుకున్న విధంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ చదవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నా.

– వర్షిత్ గౌడ్, విద్యార్థి, ప్రతిభ కళాశాల (98.15 పర్సంటైల్)

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల: పట్టణంలోని ఎర్రగుట్ట డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద నివాసముంటున్న వెంకటేశ్ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. శుక్రవారం అతడు బంధువుల పెళ్లికి వెళ్లి వచ్చి చూసే సరికి ఇంటి తాళం విరగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలో ఉన్న 4 తులాల బంగారం, 20 తులాల వెండి నగలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
మహబూబ్‌నగర్
ఆదివారం ॥ 20-4-2025

ఈస్టర్ పర్వదినం ప్రత్యేకం

దేవుని విమోచన కార్యక్రమంలో అత్యంత శకిమంతమైనది క్రీస్తు పునరుత్థాన శక్తే. మానవునికి మరణం తోనే జీవితం అంతం కాదని పునరుత్థానం తెలియజేసింది. ప్రతి మనిషి సదాకాలము దేవునితో కలిసి జీవించవచ్చన్న గొప్ప నిరీక్షణ కలిగింది. ఎందుకంటే యేసు అంటున్నాడు 'పునరుత్థానం జీవం నేనే. నా యందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రతుకును. బతికి నాయందు విశ్వాసముంచు వాడు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు'.

మరణమా నీ ముల్లెక్కడ?

శుక్రవారం సిలువ వేయబడిన యేసును తలచుకొని యూదా మతపెద్దలు యేసు ఇక శాశ్వతంగా మట్టిలో కలిసి పోయాడని సంబర పడ్డారు. వారిలో ఆ దుష్ట తలంపు పెట్టిన అపవాదియైన సాతాను దేవునిపై విజయం సాధించానని ఇక ఈ లోకం అంతా తన చెప్పు చేతల్లో ఉండిపోతుందని భ్రమ పడ్డాడు. అయినా ఎందుకైనా మంచిదని క్రీస్తును ప్రత్యేకంగా అరిమత్తయి ఏర్పాటు చేసిన సమాధి చుట్టూ ఎవరు తొలగించలేని పెద్ద రాతిని ఏర్పాటు చేశారు. బలమైన రోమా సైనికులను సమాధికి కాపలాగా పెట్టారు. క్రీస్తు మూడవ దినమున లేస్తానని చెప్పిన మాట నెరవేరకుండా శతవిధాలుగా తమ ప్రయత్నం వారు చేశారు. ఇక ఏసు చరిత్ర శాశ్వతంగా ఖననం చేశామని ఇక ఎప్పటికీ తామే మతపెద్దలుగా యూదా ప్రజలను తమ అధీనంలోనే వుంచుకోవచ్చని రోమా అధికారులకు లంచం కడుతూ తమ పబ్బం గడుపుకోవచ్చని కలలుగంటూ శనివారం అంతా హాయిగా నిద్రపోయారు. మరోపక్క యేసు చేసిన అద్భుత సూచక క్రియలు చూసి ఆయన పరలోక దివ్య వాక్కులు విన్న ప్రజలు యేసు సిలువ మరణాన్ని జీర్ణించు కోలేని స్థితిలో వుండిపోయారు. యూదా గలిలయా సమరియ ప్రాంతాల్లో క్రీస్తు ద్వారా స్వస్థత పొందిన గుడ్డి, కుంటి, మూగ, చెవిటి వారు, కుష్ఠ రోగులు మరణించి క్రీస్తుతో బతికింపబడినవారు, క్రీస్తును అభిమానించేవారు, వివిధ అద్భుతాలను చూసినవారు యేసు మరణంతో శోకసంద్రంలో మునిగిపోయారు. చివరకు యేసుతో మూడున్నర సంవత్సరాలు తిరిగిన ఆయన శిష్యులు యూదా మతపెద్దలకు భయపడి యెరూషలేము పట్టణంలో ఓ గదిలో దాక్కుండిపోయారు. అయినా దేవుని ప్రవచనాలు నెరవేరక తప్పవు కదా! భూమి పునాదులు వేయక ముందే ఆయన ఏర్పాటు చేసిన రక్షణ ప్రణాళిక అనాది సంకల్పం నెరవేరక తప్పదు కదా!

యేసు పునరుత్థాన శక్తి

యేసు తన శరీరంలో సిలువ ద్వారా పాపానికి శిక్ష విధించి బలి అర్పణగా శరీరాన్ని సమర్పించడం ద్వారా మరణంపై సాతాను కున్న అధికారాన్ని నాశనం చేశాడు. మనుషుల్లో మరణం పట్ల ఉన్న భయాన్ని పునరుత్థాన శక్తితో తీసివేయడం ద్వారా దేవునితో ధైర్యంగా విశ్వాసంతో ముందుకు కొనసాగడానికి బాటలు వేశాడు. ప్రథమ మానవుడైన ఆదామును సాతాను లోబరుచుకొని మరణానికి పాత్రుడుగా చేశాడు. ఫలితంగా పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పని పరిస్థితి నెలకొంది. అయితే కడపటి ఆదాముగా వచ్చిన యేసు పునరుత్థానం ద్వారా ఆ శాపం పూర్తిగా తొలగించబడింది. అంటే మనుష్యుని ద్వారా ఎలా మరణం వచ్చిందో మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానం కలిగింది. ఈ ప్రక్రియ ద్వారా క్రీస్తులా ప్రతి ఒక్కరూ పునరుత్థానం పొందే అవకాశం లభించింది.

తొలగింపబడిన రాయి

ఆదివారం ఉదయమే ఇంకా తెల్లవారకముందు యేసు ద్వారా స్వస్థత పొందిన మగ్దలేని మరియ, కొంతమంది ధైర్యవంతులైన స్త్రీలు సుగంధ ద్రవ్యాలను తీసుకొని యేసును సమాధి చేసిన చోటుకు చేరుకున్నారు. రోమా అధికారక ముద్రతో వేయబడ్డ ఆ పెద్ద రాయి ఎవరు తొలగిస్తారన్న ఆలోచన ఆ మహిళకు కలిగింది. తీరా సమాధి వద్దకు వచ్చి చూస్తే వారి జీవితంలో ఎన్నడు కలుగనంత విభ్రాంతికి లోనయ్యారు. అప్పటికే సమాధి మీద రాయి తొలగించబడింది. అంతకు క్రితమే యేసు సమాధిమీద ఉన్నరాయి పరలోకం నుండి ప్రభువుదూత దొర్లించినట్లు లేఖనాలలో రాయబడింది. ఆ ప్రాంతంలో భూకంపం వచ్చింది. అక్కడ కావలి వున్న రోమా సైనికులు భయపడి చచ్చినవారిలా పరుండిపోయారు. స్త్రీలు అక్కడికి వచ్చినప్పుడు రాయి దొర్లించబడి ఉండటం చూశారు. సమాధి లోపల యేసు దేహం వారికి కనిపించలేదు. అప్పుడు దూత ప్రత్యక్షమై "సజీవుడైన క్రీస్తును మృతులలో ఎందుకు వెదుకుచున్నారు? ఆయన ముందుగా చెప్పిన విధంగా లేచి యున్నాడు. ఈ శుభవర్తమానం శిష్యులకు తెలియజేయండి" అని చెప్పడంతో స్త్రీలు మహానందంతో వెనుకకు తిరిగారు.

పునరుత్థానుడైన క్రీస్తు

యేసు చెప్పిన విధంగానే చనిపోయిన మూడవరోజు మృత్యుంజయుడై లేచాడు. దానితో ప్రపంచ చరిత్రలో మరణాన్ని గెలిచి లేచిన చారిత్రాత్మిక పురుషుడిగా నిలిచి పోయాడు. ప్రపంచ చరిత్ర క్రీస్తుపూర్వం క్రీస్తు శకంగా చీలిపోయింది. పునరుత్థానుడైన యేసు ముందుగా తనను వెదకడానికి వచ్చిన స్త్రీలకు కన్పించి వారికి శుభమని చెప్పి ముందు మీరు వెళ్ళి నా శిష్యులకు గలిలయ వెళ్ళమని చెప్పి అక్కడ వారిని కలుస్తానని చెప్పాడు.

ఈలోగా సమాధికి కాపలాగా ఉన్న రోమా సైనికులు ప్రధాన యాజకుల వద్దకు పోయి యేసు మరణం నుండి లేచిన సంగతి వివరించారు. వారు రోమా సైనికులకు లంచం ఇచ్చి ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని చెబుతూ మేము రాత్రివేళ నిద్దుర పోతుంటే యేసు శిష్యులు వచ్చి యేసు శరీరాన్ని ఎత్తుకు వెళ్ళారని అబద్ధం చెప్పండి ఒకవేళ అధికారులు ఏమన్నా హడావుడి చేస్తే వారిని మేము చూసుకుంటామని నచ్చచెప్పి పంపించి వేశారు. అయితే యేసు చెప్పిన విధంగానే గలిలయ శిష్యులకు దర్శనం ఇచ్చాడు.

ఈ ఈస్టర్ పండుగ సమయంలో యేసు పునరుత్థాన శక్తి ప్రతి ఒక్కరం పొందుదం గాక! ఆమేన్!!

– మన్య జ్యోత్స్న రావు



నవోదయాన్నిచ్చిన ఆదివారం

మానవ చరిత్రలో ఆ ఆదివారం ఎన్నటికీ మరపురానిది. ఎందుకంటే యేసుక్రీస్తు అన్ని కుట్రలనూ, దుర్మార్గాలనూ, దౌర్జన్యాలనూ పటాపంచలు చేసి సమాధినీ, మరణాన్నీ గెలిచి సజీవుడు కావడం ద్వారా దీనులు, పాపులు, నిరాశ్రయులందరికీ నవోదయాన్నిచ్చిన దినం ఆ ఆదివారం...

యేసుక్రీస్తు మానవరూప ధారియైన రక్షకుడుగా ఈ లోకానికి తన పరమ తండ్రి ఆదేశాలు, సంకల్పాలను అమలుపర్చడానికి విచ్చేసిన దైవకుమారుడు, అంటే అన్నివిధాలా దేవుడే!!!. అలాగైతే జననానికి, మరణానికి, పునరుత్థానానికి దేవుడు అతీతుడు కదా... మరి ఇదంతా ఎందుకు జరిగింది? అన్న ప్రశ్న తప్పక రావాలి.

నాలుగేళ్ల ఒక బాలుడు నీళ్లు పెద్దగా లేని ఒక బావిలో పడ్డాడు. అయ్యో అంటూ జనం బావి చుట్టూ గుమికూడారు. వాడసలే భయకంపితుడై ఉన్నాడు. పైగా పసితనం, అంతా గందరగోళం.. గట్టిగా ఏడుస్తున్నాడు. ఇంతలో ఒకాయన బావి వద్దకొచ్చి లోనికి తొంగి చూశాడు. వెంటనే అక్కడున్న ఒక తాడు తన నడుముకు కట్టుకొని అక్కడున్న వారితో తనను లోనికి దించమన్నాడు. అతన్ని చూసి పిల్లాడు మహదానందంతో 'డాడీ' అని గట్టిగా అరిచి తండ్రిని కరిచి పట్టుకున్నాడు. తండ్రి వాడిని చంకకేసుకొని గట్టిగా కరుచుకొని తమను పైకి లాగమన్నాడు. పిల్లాడు బావిలో పడిపోతే అందరికీ సానుభూతే!! కాని పర్యవసానాలాలోచించకుండా చనిపోయేందుకు కూడా తెగించి కొడుకును కాపాడుకునే శక్తి ఒక్క తల్లి, తండ్రి ప్రేమకు మాత్రమే ఉంటుంది. శుక్రవారం నాడు సిలువలో అదే జరిగింది. పాపిని కాపాడేందుకు పరమ తండ్రి కుమారుడిగా, రక్షకుడుగా చనిపోయేందుకు కూడా సిద్ధపడి యేసుప్రభువు బావిలోకి దూకాడు. నేను చనిపోయినా ఫరవాలేదు, నా కుమారుడు బతికితే చాలు అనుకునేదే నిజమైన తండ్రి ప్రేమ. పరమ తండ్రిలో ఆయన అద్వితీయ కుమారుడు, కుమారునిలో పరమ తండ్రి సంపూర్ణంగా విలీనమైన అపారమైన ప్రేమ ఆ దైవత్వానిది. బావిలోనుండి కొడుకుతో సహా బయటికొచ్చిన సమయమే యేసు మరణాన్నీ గెలిచి సజీవుడైన ఈస్టర్ ఆదివారపు నవోదయం.

నేనే పునరుత్థానాన్ని... నేనే జీవాన్ని

ఆయన ఆరోహణుడు కావడం కళ్లారా చూసిన అనుభవంతో ఆయన అనుచరుల జీవితాలు సమూలంగా పరివర్తన చెందాయి. ఆయన సజీవుడైన దేవుడు అన్న నిత్యసత్యం వారి జీవితాల్లో లోతుగా ప్రతిష్ఠితమై వారంతా ఒక బలమైన చర్చిగా శక్తిగా ఏర్పడి, ఆ తర్వాత సువార్త సత్యం కోసం ప్రాణాలు కూడా త్యాగం చేసేందుకు సంసిద్ధమయ్యే ధైర్యాన్ని వారికిచ్చింది. మరణానికి మనిషిపై పట్టు లేకుండా చేసిన నాటి ఉదంతమే ఈస్టర్ అనుభవం.

యేసుప్రభువు నేనే పునరుత్థానాన్ని, జీవాన్ని అని కూడా ప్రకటించి, తానన్నట్టే చనిపోయి తిరిగి లేవడం ద్వారా తానే జీవాన్నని రుజువు చేసుకున్నాడు. తనలాగే విశ్వాసులు కూడా పురుత్థానం చెంది పరలోకంలో తమ దేవుని సహవాసంలో నిత్య జీవితాన్ని పొందుతారని ప్రభువు బోధించాడు.

– డా. సుభక్త

హెల్త్

సమ్మర్... చైల్డ్ కేర్!

ఎండలు మండిపోతున్నాయి. పిల్లలకు సెలవులూ వచ్చాయి. నీడపట్టున ఉండాల్సిన పిల్లలు కాస్తా సెలవుల్లో ఆడుకోవడం కోసం ఎండల్లోకి వెళ్తే...? అది మరింత ప్రమాదం. ఈ వేసవి వేడిమితో చిన్నారులకు వచ్చే సమస్య లేమిటో, ఈ సెలవుల ఎండల్లోంచి పిల్లలను కాపాడుకోవడం ఎలాగో తెలిపే కథనమిది.



పిల్లలకు ఆటల్లో ఒళ్లు తెలియకపోవడమే కాదు... ఎండ తీవ్రతా తెలియదు. ఇప్పటికే ఎర్రటిఎండ మండుతోంది. ఇంతటి ఎండల తీవ్రత వల్ల ఆరుబయట ఆడే పిల్లలకు వడదెబ్బ మొదలుకొని, డీహైడ్రేషన్ వరకు ఎన్నో సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నీడపట్టున ఉంటే వడదెబ్బ తగలదని కొందరి అభిప్రాయం. కానీ నీడ ఉన్నప్పటికీ అక్కడ వేడిమి తీవ్రత ఎక్కువగా ఉంటే వడదెబ్బ తగిలే ప్రమాదం లేకపోలేదు. వేసవిలో చిన్నారులకు ఎండ ముప్పులు ఏయే రూపాల్లో వస్తాయో చూద్దాం.

ఎండ తీవ్రతతో సమస్యలివి...

మజిల్ క్రాంప్స్: దేహం తన జీవక్రియలను కొనసాగించడానికి మెదడు నుంచి ప్రతి నరానికీ ఆదేశాలు అందుతూ ఉంటాయి. ఈ ఆదేశాలన్నీ లవణాలలోని విద్యుదావేశం కలిగిన అయాన్లు నరాల ద్వారా ప్రసరించడం వల్ల కండరాలకు ఆదేశాలందుతూ ఉంటాయి.



ఎండవేడిమి తీవ్రతతో చెమట రూపంలో నీటినీ, లవణాలనూ కోల్పోవడం వల్ల నరాల ద్వారా మెదడునుంచి కండరాలకు సరైన ఆదేశాలందవు. దాంతో డీ–హైడ్రేషన్‌కు గురి కాగానే కండరాలు బిగుసుకుపోతాయి. వీటినే మజిల్‌క్రాంప్స్‌గా చెబుతారు. మజిల్‌క్రాంప్స్ వస్తే వెంటనే దేహానికి నీటిని అందించాలి.

పిల్లల్లో మజిల్ క్రాంప్స్ వస్తే: పిల్లలకు మజిల్‌క్రాంప్స్ కారణంగా కండరాలు బిగదీసుకుపోతుంటే వారికి 'ఓరల్–రీ–హైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణాన్ని తాగించాలి. ● ఓఆర్ఎస్ అందుబాటులో లేకపోతే కొబ్బరినీళ్లు కూడా తాగించవచ్చు. ● ఓఆర్ఎస్‌గానీ, కొబ్బరినీళ్లుగానీ అందుబాటులో లేకపోతే... ఒక అరటిపండు తినిపించి, మంచినీళ్లు తాగించాలి. అరటిపండులో పొటాషియం వంటి లవణాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అరటిపండూ, నీళ్లతో అవి చాలా వరకు భర్తీ అవుతాయి.

వడదెబ్బ: ఒక్కోసారి చాలా ప్రాణాంతకంగా మారే మెడికల్ ఎమర్జెన్సీ కండిషన్ ఈ వడదెబ్బ. శరీర జీవక్రియలన్నీ సక్రమంగా జరగడానికి అవసరమైన ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్. కానీ పిల్లలు వడదెబ్బకు లోనైతే వారి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పెరిగిపోతుంది. వాస్తవానికి శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీలు మెయింటెయిన్ అయ్యేందుకు మెదడులోని హైపోథెలామస్ అనే గ్రంథి తోడ్పడుతుంది. దేహ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు చెమటలు పట్టి... దేహంలోంచి ఉష్ణోగ్రతను తీసుకుని ఆ చెమటలు ఆవిరైపోతూ ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత ఒకే స్థాయిలో మెయింటైన్ అవుతుంటుంది. కానీ దేహ ఉష్ణోగ్రత అదే పనిగా పెరిగిపోతూ ఉండటంతో స్వేదగ్రంథులు అలసిపోయి ఇక ఏమాత్రం పనిచేయని స్థితికి చేరుకుంటాయి. దాంతో శరీరం వేడెక్కుతున్నా... దాన్ని నియంత్రిస్తూ ఉష్ణోగ్రత సమంగా ఉండేలా చేయడానికి అవసరమైన యంత్రాంగం విఫలం కావడంతో దేహ ఉష్ణోగ్రత ఇంకా ఇంకా పెరిగిపోతుంది. దీనికి ఓ సూచన కూడా ఉంటుంది. పిల్లల చంకల్లోనూ చెమట పట్టని స్థితి రావడం ఒక్కోసారి పిల్లలు స్పృహ తప్పిపోయి అపస్మారక స్థితికి చేరడం వడదెబ్బను సూచిస్తాయి.



వడదెబ్బలో లక్షణాలివి...

● వికారం; ● వాంతులు; ● కళ్లు తిరగడం; ● నీరసం; ● స్పృహ తప్పడం; ● ఫిట్స్ రావడం; ● చివరగా కోమాలోకి వెళ్లడం జరగవచ్చు.

వడదెబ్బకు చికిత్స: దేహ ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు చేరి అంతకంతకూ పెరుగుతుంటే... ఆ కారణంగా మెదడు, గుండె, మూత్రపిండాలు, కాలేయం వంటి కీలకమైన అవయవాల పనితీరు తీవ్రంగా దెబ్బతింటుంది. అప్పుడు శరీర ఉష్ణోగ్రతను మళ్లీ సాధారణ స్థాయికి (నార్మల్‌కు) తీసుకురావడం అవసరం.

ఒంటి ఉష్ణోగ్రత 100 ఫారెన్‌హీట్‌కు మించుతున్నట్లు తెలియగానే వెంటనే పిల్లలను చల్లటి గాలి సోకేలా ఫ్యాన్ కింద ఉంచాలి. ఫ్యాన్ కింద కూడా వేడిగాలి వస్తుంటే పిల్లల దుస్తులను వదులు చేసి, ఒంటికి చల్లగాలిని బాగా తగలనివ్వాలి. దుస్తులు ఇబ్బందికరంగా ఉంటే నడుముకు చిన్న ఆచ్ఛాదన ఉంచి, బట్టలన్నీ తీసేయాలి. చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో ఒళ్లంతా తుడుస్తూ చల్లటి గాలి ఒంటికి వేగంగా తగులుతూ వెళ్లేలా చూడాలి. ఇలా ఒళ్లు త్వరగా చల్లబడుతుంది.

● ఈ చర్యల తర్వాత కూడా శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే పిల్లల చంకల కింద / గజ్జల దగ్గర ఐస్ గడ్డలనుంచాలి. దాంతో శరీరం మరింత చల్లబడుతుంది. అప్పటికీ శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే, దాన్ని మెడికల్ ఎమర్జెన్సీగా గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

ఎండల్లో పిల్లలు ఎక్కువగా చెమట వల్ల నీరూ, లవణాలూ కోల్పోతున్నారని తెలియడానికి విపరీతంగా చెమట పట్టడమే సూచన అని కొందరు అపోహపడుతుంటారు. అది వాస్తవం కాదు. పిల్లలతో పోలిస్తే పెద్దల్లో చెమట గ్రంథులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఉష్ణోగ్రత పెరగగానే చెమటలు పట్టడం పెద్దల్లోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. కానీ పిల్లల్లో అలా కాదు. వాళ్లలో పెద్దల మాదిరిగా చెమటలు పట్టాలంటే చాలా ఎక్కువ ఉష్ణోగ్రత అవసరం. ఒంటిని చల్లబరిచే మెకానిజమైన చెమట పట్టడమన్నది పిల్లల్లో కాస్త తక్కువే కావడం వల్ల పెరిగే కొద్దిపాటి వేడిమి కూడా పిల్లలపై ఎక్కువగా దుష్ప్రభావం చూపుతుంది. అందుకే పిల్లలకు పెద్దగా చెమటలు పట్టకపోయినా... వాళ్ల ఒంటి ఉష్ణోగ్రత త్వరగా పెరుగుతుందని తెలుసుకోవడంతోపాటు చిన్నపిల్లల్లో చెమట గ్రంథుల సంఖ్య తక్కువ కాబట్టి వేడెక్కిన ఒళ్లు వెంటనే చల్లబడదు కాబట్టి బాగా చల్లగా ఉండేచోటే వాళ్లు ఆడుకుంటూ ఉండేలా చూడాలి. ఆరుబయటి ఉష్ణోగ్రత బాగా తగ్గాకే వారిని బయట ఆటలాడటానికి అనుమతించాలి.



పెద్దల కంటే పిల్లల్లో చెమట గ్రంథులు తక్కువ కాబట్టి...

ఒబేస్ పిల్లలకు జాగ్రత్త అవసరం!

మామూలు పిల్లలతో పోలిస్తే కాస్త ఒబేస్‌గా ఉండే పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆ పిల్లల ఒంట్లోంచి నీళ్లు కోల్పోతున్నప్పుడు ఆ నీటితో పాటు విలువైన ఖనిజలవణాలనూ కోల్పోతున్నారని గ్రహించాలి. స్థూలకాయమున్న పిల్లలు బాగా ఆటలాడుతున్నప్పుడు ప్రతి కిలోకు 50 మిల్లీలీటర్ల నీరు కోల్పోవచ్చు. దాంతో తమ పిల్లలు బరువు కోల్పోతూ, ఆరోగ్యంగా మారుతున్నారంటూ పెద్దలు అపోహ పడటం సరి కాదు. వాళ్లు విలువైన ఖనిజలవణాలు కోల్పోయి డీ–హైడ్రేషన్‌కు గురవుతున్నారనే విషయాన్ని గ్రహించాలి. అందుకే ఇలా బరువు తగ్గుతున్నప్పుడు పెద్దలు వారి ఒంటిలో జరిగే జీవక్రియలకు (మెటబాలిక్ యాక్టివిటీస్‌కు) అవసరమైన నీటిని వెంటవెంటనే భర్తీ చేస్తూ ఉండాలి. అందుకే స్థూలకాయులైన పిల్లలు వెంటవెంటనే మరింత బరుతు తగ్గుతున్నట్లు గ్రహిస్తే పెద్దలు వారి ఒంట్లోకి తగిన ఎలక్ట్రొలైట్స్ పంపించేందుకు కొబ్బరినీళ్లు, గ్లూకోజ్ వంటివి ప్రతి 20 నిమిషాలకొకసారి తాగిస్తూ ఉండటం తప్పనిసరి.

ఎండ దుష్ప్రభావాల నివారణ ఇలా...

● ఎండవేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇంట్లోని చల్లటి ప్రదేశాల్లోనే ఆడుకునేలా ప్రోత్సహించాలి. ● ఎండవేళల్లో ఇన్‌డోర్ గేమ్స్‌కు మాత్రమే వారిని పరిమితం చేస్తే బాగుంటుంది. ● ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారిని ఇంట్లోనే, అందునా ఇంట్లో కూడా చల్లగా ఉండే ప్రదేశాల్లోనే ఉండేలా చూడాలి. ● ఆటల్లో పూర్తిగా నిమగ్నమైపోయిన పిల్లలు తరచూ మంచినీళ్లు తాగకపోవచ్చు. అందుకే తరచూ వారు కొద్దికొద్దిగా మంచినీళ్లు తాగుతుండేలా చూడాలి. వీలైతే మధ్య మధ్యలో కొబ్బరినీళ్లు, పళ్లరసాలు కూడా ఇవ్వవచ్చు.

ఇలాంటి కొద్దిపాటి జాగ్రత్తలతో పిల్లలు వేసవి దుష్ప్రభావాలకు లోనుకాకుండా జాగ్రత్త పడాలి. సాయంత్రాలు బాగా చల్లబడ్డ తర్వాతనే వాళ్లను ఔట్‌డోర్ గేమ్స్‌కు అనుమతించాలి.



డా॥ శివనారాయణ రెడ్డి వెన్నపూస,
సీనియర్ నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్

ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకుంటున్నారా?

గతంలో గర్భధారణ (ప్రెగ్నెన్సీ) ప్లానింగ్ అంటూ ఏదీ ఉండేది కాదు. నిజానికి తమకు కావాల్సినప్పుడు, తమకు అవసరమైన సమయంలోనే ప్రెగ్నెన్సీ వచ్చేలా ప్లాన్ చేసుకుంటే... అది వచ్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కాబోయే తల్లికీ, పుట్టబోయే బిడ్డకూ చాలా ప్రయోజనాలు ఉంటాయి. తల్లీ బిడ్డా సురక్షితంగా కూడా ఉంటారు. సరైన ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌తో ప్రయోజనాలెలా కలుగుతాయో తెలుసుకుందాం.

గతం తరం యువతుల్లో తమకు ప్రెగ్నెన్సీ వచ్చిన విషయం నెల తప్పిన తర్వాత గానీ తెలిసేది కాదు. అప్పుడు... తమకు పెగ్నెన్సీ వచ్చిందా లేదా అని తెలుసుకోవడం కోసం ఇంట్లోనే కొన్ని పరీక్షలు చేసుకునేవారు. అయితే గర్భధారణను ముందే ప్లాన్ చేసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లల్లో కొన్ని లోపాల నివారణకు ముందునుంచే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న మహిళ తాము నెల తప్పాలనుకున్న మూడు నెలల ముందు నుంచే ఫోలిక్ యాసిడ్ అనే పోషకాన్ని తీసుకోవడం వల్ల ప్రయోజనాలుంటాయి. మార్కెట్‌లో మాత్రల రూపంలో దొరికే ఈ ఫోలిక్ యాసిడ్ చాలా చవక. నిజానికి పాలకూర లాంటి ఆకుకూరల్లో అది సమృద్ధిగా ఉంటుంది. పిండంలో వచ్చేందుకు అవకాశమున్న న్యూరల్ ట్యూబ్ (వెన్నుపాము) లోపాలను అది అరికడుతుంది. పుట్టుకతో వచ్చే ఈ వెన్నుపాము లోపాలను స్పైనాబైఫిడా అంటారు. ఫోలిక్ యాసిడ్ ఇలాంటి అనేక ప్రెగ్నెన్సీ లోపాలను అరికడుతుంది కాబట్టి ప్రెగ్నెన్సీని ప్లాన్ చేసుకున్న మహిళలకు మూడు నెలల ముందునుంచే అబ్‌స్టెట్రీషియన్స్/ గైనకాలజిస్టులు ఫోలిక్ యాసిడ్ మాత్రలను సూచిస్తుంటారు. ప్రెగ్నెన్సీ ప్లానింగ్ వల్ల స్పైనా బైఫిడా మాత్రమే కాకుండా పోష్టికాహార లోపాల వల్ల పిండదశలో ఎదురయ్యే మరెన్నో సమస్యలూ నివారించవచ్చు. అంతేకాదు... దేశంలోని మహిళల్లో దాదాపు 59 శాతం మందిలో రక్తహీనత (అనీమియా) ఎక్కువ. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునే మహిళకు ఐరన్ సప్లిమెంట్లు ఇవ్వడం ద్వారా కూడా కాబోయే తల్లీ, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంది.



గర్భం ప్లాన్ చేసుకున్న నాటి నుంచి మహిళకు అన్ని పోషకాలూ అందేలా ఆరోగ్యకరమైన సమతులాహారాన్ని ఇవ్వడం, అందులో కూరగాయలు, ఆకుకూరలు, తాజాపండ్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలతో ఇటు కాబోయే తల్లి, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ఆ చిన్నారికి తగినంత రోగనిరోధక శక్తి సమకూరేలా జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశముంటుంది.



డా॥ స్వప్న సముద్రాల
సీనియర్ గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్టెట్రీషియన్